క్లుప్తంగా

శానిటేషన్ వర్కర్లకు చెప్పులు పంపిణీ

తెనాలిటౌన్: స్థానిక పురపాలక సంఘ మెప్మా షెడ్డులో గురువారం పారిశుద్ధ్య కార్మికులకు రెండు జతల చెప్పులు పంపిణీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావులు పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు చెప్పులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ ఎం.యేసు బాబు, మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, అసిస్టెంట్ సీటీ ప్లానర్ శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



తెనాలిటౌన్: ఏపీ పీటీడీలో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు ఉద్యోగ భద్రత కల్పించాలని అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పినపాటి సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 7,300 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నట్లు తెలిపారు. వీరి సమస్యలపై ఈ నెల 4,5 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 129 డిపోల్లో గెట్ మీటింగ్, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుచెప్పారు. కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగులకు ఆర్టీసీ యాజమాన్యం ద్వారా వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మోహన్, సెక్రటరీ రాజేష్, కోశాధికారి మధు, తదితరులు ఉన్నారు.

చోరీకి గురైన కెమెరాలు స్వాధీనం

తెనాలిరూరల్: పట్టణ గంగానమ్మపేటలో గత నెల 26న సుమారు రూ. 10 లక్షల విలువైన కెమెరాలు చోరీకి గురయ్యాయి. ఓ ఫోటో స్టూడియో తలుపుకు ఉన్న అదదం తొలగించి లోనికి ప్రవేశించిన దుండగులు కెమెరాలను అపహరించి తిరిగి అద్దాన్ని యథాస్థితిలో ఉంచారు. దీనిపై స్టూడియో నిర్వాహకుడు గారపాటి రఘు పోలీసులను ఆశ్రయించగా టూటౌన్ పోలీసులు నిందితులను గుర్తించి కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. అలానే నిందితులను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులో జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. డెంగీ, మలేరియా వ్యాధులు కలిగించే దోమల ఉధ్ధృతి తొలగించాలంటే శుభ్రత పాటించాలని చెప్పారు. నీరు నిలువ ఉంచడం ద్వారా దోమలు పెరిగి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం లింగంశెట్టి, సాంబయ్య, ఎంపీహెచ్‌ఏఎం బాబురావు, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్‌ఎం అంతోనిరాణి, ఆశా కార్యకర్తలు సుజాత, పద్మ, శాంతకుమారి, జోజమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీ రంగారావు జయంతి



తాడేపల్లి రూరల్: విశ్వ నట చక్రవర్తి, నటసార్వభౌమ ఎస్వీ రంగారావు 107వ జయంతిని గురు వారం తాడేపల్లి విజయవాడ క్లబ్ రోడ్‌లోని పూలమార్కెట్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎస్వీ రంగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాకాపునాడు అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు మాట్లాడుతూ.. ఎస్వీ రంగారావు సినీ రంగానికి ఎనలేని సేవలు చేశారని.. పౌరాణిక, సాంఘిక పాత్రలలో తన నట విశ్వరూపాన్ని ప్రదర్శించి తెలుగు ప్రేక్షకుల మనసులను దోచుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రజాకాపునాడు తాడేపల్లి పట్టణ అధ్యక్షులు పల్లెపు భాస్కరరావు, ఉపాధ్యక్షులు వలివేటి రమేష్, కాపుయూత్ అధ్యక్షులు నక్కా నవీన్ రాజా, యువత కార్యదర్శి రమణ, ఉపకార్యదర్శి దుర్గారావు, ప్రచార కార్యదర్శి అడపా నరేష్, కోశాధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

పట్నంబజారు: తల్లి మందలించిదనే కోపంతో గురువారం యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతీలాల్‌నగర్‌కు చెందిన బి. సాయికుమార్ (28) నిత్యం మద్యం తాగుతూ పనులకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. తల్లి మంగమ్మ పనికి వెళ్లమంటూ మందలించింది. దీంతె మస్తాపానికి గురైన సాయికుమార్ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

9న దేశవ్యాప్త సమ్మెలో..

ఎల్‌ఐసీ ఉద్యోగుల భాగస్వామ్యం

గేట్ మీటింగ్‌లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ కార్యదర్శి జి.కిషోర్ కుమార్



మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

తెనాలి: జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు ప్రకారం ఈనెల 9న జరగనున్న సమ్మెలో జరిగే సమ్మెకు సన్నాహంగా గురువారం స్థానిక ఎల్ఐసి తెనాలి బ్రాంచ్‌లో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ కార్యదర్శి జి.కిషోర్ కుమార్, జాయింట్ సెక్రెటరీ వీవీకే సురేష్, వైస్ ప్రెసిడెంట్ జానీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర యూనియన్లు ఈనెల 9న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. 85 శాతానికి పైగా ఎల్ఐసీ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కూడా దేశవ్యాప్త సమ్మెలో భాగస్వామిగా ఉందన్నారు. సమ్మె డిమాండ్లను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ రంగ ఎల్ఐసీని బలహీనపరిచే విధానాలను ప్రభుత్వం విడనాడాలనీ, బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రస్తుతమున్న 74 నుంచి 100 శాతానికి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించటం సమంజసం కాదన్నారు. ఎల్ఐసీలో వేలసంఖ్యలో గల ఉద్యోగాల ఖాళీల్లో క్లాస్ 3,4 క్యాడర్లలో రిక్రూట్‌మెంట్‌ను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ పాత పెన్షన్ స్కీంను వర్తింపజేయాలనేది మరో డిమాండ్‌గా తెలిపారు. ఉద్యోగులు దాచుకున్న పెన్షన్ నిధులను స్టాక్ మార్కెట్లకు తరలించటం నష్టదాయకమన్నారు. బీమా ప్రీమియంపై 18 శాతం జీఎస్టీ విధించటం ప్రజలకు ఆరోగ్య బీమాను దూరం చేయటమేనన్నారు. వీటితోపాటు అధిక ధరలు, పనిగంటల పెంపు, వివిధ రంగాల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ, కనీసం వేతనం రూ.26 వేలకు పెంపు వంటి సమస్యలపై సమ్మె జరగనుందని వివరించారు. కోట్లాది ఉద్యోగులు, కార్మికులు పాల్గొనే ఈ జాతీయ సమ్మెకు ప్రజలు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ తెనాలి శాఖ కార్యదర్శి కోళ్లపూడి రాజు, అధ్యక్షుడు కె.వినయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ నరసింహారావు, ఎల్ఐసీ తెనాలి బ్రాంచ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ కార్యదర్శి బి. పూర్ణ నారాయణ, ఎల్ఐసి తెనాలి బ్రాంచ్ ఏజెంట్ అసోసియేషన్ కార్యదర్శి పాలడుగు రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రయాణికులతో జాగ్రత్తగా మెలగండి

- తెనాలి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హీరా సింగ్ సూచన
- రైల్వే స్టేషన్‌లో స్టాండ్ ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న ఆర్పీఫ్ ఇన్‌స్పెక్టర్ హీరాసింగ్

తెనాలిరూరల్: ప్రయాణికులతో జాగ్రత్తగా మెలగాలని, అనుమతులను ప్రజా రవాణా వాహనాలను అడ్డుకో రాదని తెనాలి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హీరా సింగ్ ఆటో డ్రైవర్లకు చెప్పారు. తెనాలి రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని ఆటో డ్రైవర్లకు గురువారం ఏఎస్ఐ ఎం. శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రాపిడో వంటి ఆథరైజ్డ్ వాహనాలను అడ్డుకొని ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసిన సందర్భం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకూడదని చెప్పారు. ప్రతి ఒక్కరు డ్రైవర్ లైసెన్సు, ఆటోకు సంబంధించిన పత్రాలు ఎప్పుడు దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రయాణికులపై ఎలాంటి అనుమానం వచ్చినా, వారు తీసుకువెళ్లే లగేజీపై సందేహం ఉన్నా వెంటనే ఆర్పీఎఫ్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే విధానంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆటో స్టాండ్ ప్రాంగణంలో ఆటోల పార్కింగ్ విషయంలోనూ నిబంధనలు పాటించాలని, అనుమానితులను గుర్తిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అత్యవసర సమయాలలో ఆర్పీఎఫ్, జీఆర్పీ హెల్ప్‌లైన్ నెంబర్లు 139, 100 కు సమాచారం ఇవ్వాలన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో హెడ్ కానిస్టేబుల్ కోటిరెడ్డి, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లవెంట కొబ్బరిబొండాలు వేస్తే కఠిన చర్యలు

ఇన్‌చార్జ్ కమిషనర్ వీ.ఎం.లక్ష్మీపతిరావు


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలిటౌన్: రోడ్ల వెంబడి, కాల్వల్లో కొబ్బరి బొండాలు పడవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు హెచ్చరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొబ్బరి బొండాల వ్యాపారులతో ఆయన మాట్లాడారు. కొబ్బరి బొండాల వ్యర్థాలను ఇష్టరాజ్యంగా రోడ్ల వెంబడి కాల్వల్లో వేస్తున్నట్లు పలు ఫిర్యాదులు అందాయని తెలియజేశారు. ఇటీవల పారిశుద్ధ్య నిర్వహణ కష్టతరమవుతుందని, వీటిలో నీరు నిల్వచేరి దోమల వ్యాప్తి అధికమవుతుందని వెల్లడించారు. తద్వారా అంటువ్యాధులు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యాపారులు బొండాల వ్యర్థాలను రోడ్ల వెంబడి కాల్వల్లో పడవేయవద్దని సూచించారు. సొంత వాహనాల్లో తీసుకువెళ్లి నిర్దేశించిన స్థలంలో వేయాలని కోరారు. వ్యాపారులు మాట్లాడుతూ ప్రతినెలా పన్ను చెల్లిస్తామని మున్సిపాలిటీ వాహనాలను ఏర్పాటు చేస్తే వ్యర్థాలను తరలించేందుకు తమకు వెసులుబాటుగా ఉంటుందని కోరగా ఆలోచించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. సమావేశంలో చైర్మన్ తాడిబోయిన రాధిక, హెల్త్ ఆఫీసర్ ఎం.యేసుబాబు, మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, అసిస్టెంట్ సీటీ ప్లాన్ శ్రీమన్నారాయణ, టీపీవో సాంబశివరావు, తదితరులు ఉన్నారు.

శానిటేషన్ మరింత మెరుగుపడాలి

మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక


శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాధిక

తెనాలిటౌన్: పట్టణంలో జరుగుతున్న శానిటేషన్ పనులను మరింత మెరుగుపరచాలని మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక అధికారులను ఆదేశించారు. పట్టణ 10వ వార్డులో గురువారం జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు తడిచెత్త, పొడి చెత్తను వేరువేరుగా సిబ్బందికి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. వ్యర్థాలు కాల్వల్లో వేయవద్దని తెలిపారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు కాల్వల్లో పడవేయటం వలన మురుగు పారుదలకాక పారిశుద్ధ్య నిర్వహణ కష్టతరమవుతుందని తెలిపారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి అధికారుల సూచనలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసం కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న విజయలక్ష్మి

తెనాలిరూరల్: మహిళల భద్రత, సంక్షేమం కోసం ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కంట్రోల్ కమిటీ ఉండాలని వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్ విజయలక్ష్మి చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ అధ్యక్షతన గురువారం రెవెన్యూ, వివిధ శాఖల ఉద్యోగులకు అవగాహన సదస్సు గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస, కట్నం వేధింపులు, మహిళలపై లైంగిక, మానసిక, శారీరక వేధింపులకు సంబంధించిన పలు చట్టాలు, హెల్ప్ లైన్ సెంటర్ల వివరాలను వెల్లడించారు. అలానే పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ప్రతి కార్యాలయంలో మహిళల రక్షణ కోసం ఇంటర్నల్ కంట్రోల్ కమిటీ నలుగురు సభ్యులతో ఏర్పాటు కావాలన్నారు. సమావేశంలో సచివాలయాల ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శన

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని బాలాజీ కల్యాణ మండపంలో అఖిల భారత హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టా ప్రభాకరరావు ప్రారంభించారు. శ్రీ కళాభారతి చేనేత, హస్తకళా నిర్వహిస్తున్న మేళాలో చేనేత వస్త్రాలు, దేశంలోని పలు రాష్ట్రాల వ్యాపారస్తులు హస్తకళ రూపాలను ప్రదర్శించారు. ప్రదర్శన ఈనెల 20వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది.

సొసైటీ కార్యాలయాల వద్ద వనమహోత్సవం

పండ్ల మొక్కలు నాటిన విజ్ఞాన్ వర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు



కొల్లిపర(తెనాలి): వన మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన కొల్లిపర మండలంలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచ్ ఏజీఎం ఎస్.శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ షేక్ బాజిబాబా, సూపర్‌వైజర్ టి.ప్రవీణ్ పర్యవేక్షణలో ముందుగా మండల కేంద్రమైన కొల్లిపరలోని సొసైటీ కార్యాలయం వద్ద విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల విద్యార్థినులు కొబ్బరి, ఉసిరి, మామిడి, సపోటా, సీతాఫలం వంటి పండ్ల మొక్కలను నాటారు. తదుపరి తూములూరు, అత్తోట గ్రామాల్లోని సొసైటీ కార్యాలయాల వద్ద కూడా మొక్కలను నాటారు. కార్యక్రమంలో సొసైటీల సీఈవోలు గుదిబండి శివనాగిరెడ్డి, ఆరుమళ్ల పూర్ణరెడ్డి, జి.విజయ భాస్కర్, శ్రేష్ఠ ఎఫ్‌పీసీ డైరెక్టర్ వుయ్యూరు సాంబిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పొలాల మధ్య మురుగు కాలువ పూడ్చివేత



దుగ్గిరాల: వర్షాకాలంలో పొలంలో అధికంగా ఉండే మురుగు నీరు బయటకు పారేందుకు వీలు లేకుండా తన పొలం ఎదురుగా ఉన్న కాలువను పూర్తిగా ఓ రైతు పూడ్చేశారు. వివరాలలోకి వెళ్తే.. శృంగారపురం గ్రామ శివారు పొలంలో ముప్పా చంద్రశేఖర్ అనే రైతు తన పొలం ఎదురుగా ఉన్న మురుగు కాలువను పూర్తిగా పూడ్చారు. దీంతో పై ఎత్తున ఉన్న పొలాలు 50 ఎకరాలకు ప్రవహించే మురుగు పోకుండా పంట నీటి మునిగి, రైతులు నష్టపోనున్నామని మరో రైతు మునునూరు సాంబశివరావు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పొలాల మధ్య మురుగు కాలువను పునరుద్ధరించాలని పై 50 ఎకరాల రైతులు కోరుతున్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, కాబట్టి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, సాంబశివరావు, ఇస్మాయిల్, హగ్గయ్య, కార్మికులు నవనీతమ్మ, రమణమ్మ, శారదమ్మ, రిబ్కా, కాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నియంత్రించాలి

మేడికొండూరు: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎం.అనురాధ అన్నారు. మండల కేంద్రమైన మేడికొండూరు, మంగళగిరి పాడు గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వర్యంలో బాల్య వివాహ వ్యతిరేక ప్రచారోద్యమం వీధి నాటక ప్రదర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు అరికట్టేందుకు సామాజిక మార్పు తీసుకువచ్చే కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలన్నారు. ఇలాంటి వీధి నాటకాలతో సమాజంలో ఉన్న సాంఘిక దురాచారాలు తొలగించవచ్చన్నారు. మేడికొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.జయప్రద మాట్లాడుతూ.. సమాజంలో బాలికలపై అనేక రకాల వివక్షలు జరుగుతున్నాయన్నారు. వాటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.వెంకట్, ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్, మేడికొండూరు సెక్టార్ సూపర్‌వైజర్ సునీత, సిబ్బంది మోహన్ రావు, శ్రీనివాసరావు, సుభాషిని, శాంతి శ్రీ, పద్మజా, శైలజా పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సేవలే లక్ష్యం

- విద్యుత్ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సి.హెచ్.రమేష్
- 30 లక్షల నిధులతో అభివృద్ధి పనులు


బుర్రిపాలెంలో ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న రమేష్

తెనాలిటౌన్: జిల్లా వ్యాప్తంగా నిరంతరాయంగా వినియోగదారులకు విద్యుత్ సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సి.హెచ్.రమేష్ పేర్కొన్నారు. గురువారం రూరల్ మండలం బుర్రిపాలెం, చక్రాయపాలెం గ్రామాల్లో జరుగుతున్న పాత లైన్ల మరమ్మతులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ సి.హెచ్.రమేష్ మాట్లాడుతూ తెనాలి డివిజన్ పరిధిలోని బుర్రిపాలెం, చక్రాయపాలెం గ్రామాలకు కలుగుతున్న విద్యుత్ అంతరాయాలను తగ్గించడం ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా 30 లక్షల నిధులను మంజూరు చేసి పాతలైన్లు సరిచేయడమేకాక 24 గంటలు నిరంతర విద్యుత్ అందించేందుకు పనులు జరుగుతున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసినట్లు వెల్లడించారు. బుర్రిపాలెం సర్పంచ్ పెమ్మసాని విజయలక్ష్మి, జయప్రకాష్ నారాయణ, చక్రాయపాలెం గ్రామస్తులు పరుచూరి చిన వీరయ్య, నరాలశెట్టి శ్రీనివాసరావులు ఎస్ఈ రమేష్‌ను కలిసి విద్యుత్ సమస్యలు వివరించారు. వారి వినతిని నమోదు చేసుకుని సూచనలు తప్పక పరిగణలోకి తీసుకుంటామని, త్వరితగతిన విద్యుత్ సమస్యను అధిగమిస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జిల్లా కన్‌స్ట్రక్షన్ డీఈఈ ఉదయ్, తెనాలి టౌన్ డీఈఈ బోరుగడ్డ అశోక్ కుమార్, డీ 3 సెక్షన్ ఏఈ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు రైతులు తరలి రావాలి


మాట్లాడుతున్న శివ సాంబిరెడ్డి

కొల్లిపర: పెట్టుబడిదారులు ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం రైతులు వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ 100 సంవత్సరాలు క్రితం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఈరోజు బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్స్ అమలైతే కార్మిక వర్గం సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వ రంగ సంస్థల కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే విధంగా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. దీని ఫలితంగా కోట్లాది మంది ప్రజల కష్టార్జితాన్ని కొద్దిమంది కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలకు వ్యతిరేకంగా రైతు కవులు రైతు వ్యవసాయ కార్మికులు కూడా ఈ సమ్మెకు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. సీపీఐ నాయకులు తుంగ బాలస్వామి మాట్లాడుతూ మండలంలో గల అంగన్వాడీ ఆశ పంచాయతీ కార్మికులు మధ్యాహ్న భోజన కార్మికులను స్కీం వర్కర్లుగా గుర్తించాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి కోట చంద్రశేఖర రావు మాట్లాడుతూ స్కీం వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం 26000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈనెల తొమ్మిదో తేదీన కొల్లిపర అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కార్మిక ప్రదర్శనలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పశువులకు నట్టల నివారణ మందు పంపిణీ



కర్లపాలెం: పశువులలో సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల పశు పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ తెనాలి డీడీ డాక్టర్ పద్మావతి తెలిపారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం యాజలి, బుద్ధాం గ్రామాలలో సుమారు 1,500 గొర్రెలకు, మేకలకు కర్లపాలెం పశు వైద్యాధికారి అన్సారీ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందు వేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వచ్చిన డీడీ పద్మావతి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులు పసికిరి తినటం వలన సీజనల్‌గా వ్యాధులు వస్తాయని సకాలంలో పశువులకు వైద్యం చేయించాలని చెప్పారు. పశు వైద్యాధికారి అన్సారీ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న 20 గ్రామ పంచాయతీలలో పశువులకు నట్టల నివారణ మందు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎస్ ఎ.రాజేష్, గోపాలమిత్ర శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోటార్‌సైకిల్ మెకానిక్స్ దినోత్సవం


పట్టణంలో నిర్వహించిన మోటారుబైక్ ర్యాలీ

తెనాలి: ఆంధ్రాప్యారిస్ మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మోటార్ సైకిల్ మెకానిక్స్ దినోత్సవం నిర్వహించారు. స్థానిక వహాబ్‌చౌక్‌లో అసోసియేషన్ పతాకాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మోటార్‌బైక్ ర్యాలీని అడ్‌హాక్ సభ్యుడు ఎం.వెంకటేశ్వరరావు జండా ఊపి ప్రారంభించారు తదుపరి అయితానగర్‌లోని నన్నపనేని సరస్వతి, సీతారామయ్య కల్యాణమండపంలో జరిగిన సమావేశంలో సీనియర్ మెకానిక్‌లను సత్కరించారు. తెనాలిలోని అన్ని షోరూములు, మెకానిక్‌లు, అనుబంధ పనివారు, ఆటోమొబైల్ షాపుల వారు కార్యక్రమంలో మాట్లాడారు. అడ్‌హాక్ కమిటీ సభ్యుడు సంపత్ మాట్లాడుతూ ఎన్నో ఒడుదుడుకులున్న అందరం కలసి ప్రతి పనిని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పి.డేవిడ్, ఖాశిం, గోపి, రాము, రాజారెడ్డి, జానీబాషా, ఇబ్రహీం, కరీముల్లా మాధవ, గౌసూ, నూరు మేస్త్రీ, బి.బోస్ మిస్త్రీ ప్రసంగించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

మంగళగిరి, మంగళగిరి టౌన్: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆలిండియా ముస్లిం పర్శనల్ లా బోర్డు ఆధ్వర్యంలో స్థానిక జాయింట్ యాక్షన్ కమిటీ తరుపున గురువారం మంగళగిరి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉందని.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26, 29 ప్రకారం రాజ్యాంగ హక్కులకు భంగం కలిగిస్తుందని.. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుందని ఆ వినతి పత్రంలో ప్రస్తావించారు. కార్యక్రమంలో మంగళగిరి జేఏసీ కన్వినర్ మొహమ్మద్ యూసఫ్, సభ్యులు రషీద్, అబ్దుల్ అజీమ్, బాబావలి, ఫక్రుద్దీన్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.